నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, గురువారం 11 జూలై 2024 | VIKARABAD





మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అక్రమ మద్యం సీసాలను జేసీబీతో ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

# మద్యం సీసాల ధ్వంసం

**8551 లీటర్ల మద్యం సీసాలను జేసీబీతో తొక్కించిన పోలీసులు**

మొయినాబాద్, జూలై 10 : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం పోలీసులు జేసీబీ సాయంతో మద్యం సీసాలను ధ్వంసం చేశారు. పలుచోట్ల వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాటిళ్లను అబ్కారీ శాఖ ఆదేశానుసారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, అదనపు డీసీపీ విజయ్‌కుమార్, అబ్కారీ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. సుమారు 8551 లీటర్ల మద్యాన్ని నామరూపాలు లేకుండా చేశారు.

అబ్కారీ శాఖ అనుమతులు లేకుండా అక్రమ మద్యాన్ని విక్రయిస్తే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ అదనపు డీసీపీ విజయ్‌కుమార్ ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, అబ్కారీ శాఖ సీఐ ప్రదీప్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.



**రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 64 కేసులు నమోదు**

**చేవెళ్ల మండలంలో 11 ఏండ్ల బాలుడు మృతి**

**పట్టణాలతోపాటు పల్లెలకూ విస్తరిస్తున్న డెంగీ**

**జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచే కేసులు నమోదవుతున్నాయని చెబుతున్న వైద్యాధికారులు**

**వివిధ రకాల పరీక్షలతో నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు**

# డెంగీ.. డేంజర్ బెల్స్

జిల్లాలో డెంగీ విజృంభిస్తున్నది. ఈ ఏడాదిలో ఈ తరహా కేసులు భారీగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో డెంగీ కేసులు ఇంకా పెరుగుతాయని వైద్యారోగ్య శాఖ భావిస్తున్నది. ఇప్పటివరకు జిల్లాలో డెంగీతో ఒక బాలుడు మరణించగా.. వివిధ చోట్ల 64 కేసులు నమోదయ్యాయి. ఇక ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య సైతం ఎక్కువగానే ఉన్నది. ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు నిలువు దోపిడీ చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వివిధ రకాల పరీక్షల పేరుతో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- రంగారెడ్డి, జూలై 10 (నమస్తే తెలంగాణ)



### అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు..

తీవ్ర జ్వరం, తలనొప్పి, కళ్ల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పి, రుచిని కోల్పోవడం, జలుబు, వాంతులు వంటివి డెంగీ లక్షణాలుగా గుర్తించి అప్రమత్తం కావాలని వైద్యులు సూచిస్తున్నారు. డెంగీ వచ్చిన తర్వాత ఇబ్బంది పడడం కన్నా.. దాని బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వారు పేర్కొంటున్నారు. దోమలు కుట్టకుండా..ప్రధానంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. డెంగీని ఆరంభ దశలో గుర్తిస్తే త్వరగా నయం కావడమే కాకుండా తక్కువ వ్యయంతో బయటపడే అవకాశం ఉందని అంటున్నారు. ముదిరితే ప్లేట్‌లెట్ల సంఖ్య గణనీయంగా తగ్గి ప్రాణాంతకంగా మారొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### గ్రామీణ ప్రాంతాల్లోనూ డెంగీ కేసులు..

నిన్న మొన్నటి వరకు నగరాలు, మున్సిపాలిటీలలోనే కనిపించిన డెంగీ కేసులు గ్రామీణ ప్రాంతాల్లోనూ నమోదవుతున్నాయి. జిల్లాలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలు 42 వరకు ఉండగా.. జీహెచ్ఎంసీ పరిధిలో 39 డెంగీ కేసులు, మున్సిపాలిటీల పరిధిలో 21 కేసులు, గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు కేసులు నమోదయ్యాయి. రెండురోజుల క్రితం చేవెళ్ల మండలానికి చెందిన 11 ఏండ్ల బాలుడు డెంగీ బారినపడి మరణించడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పల్లెలు, పట్టణాలు చిత్తడిచిత్తడిగా మారాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో పారిశుధ్య నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా మారింది. పరిసరరాల్లో నిల్వ ఉన్న నీటితో డెంగీ సంబంధిత దోమలు వృద్ధి చెందుతున్నాయి. సీజనల్ వ్యాధులు సైతం విజృంభిస్తున్నాయి. దీంతో చాలామంది జ్వరం, దగ్గు, జలుబు వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఓపీకి తాకిడి పెరిగింది. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఆసుపత్రులలో సుమారు 8వేలకు పైగా విష జ్వరాల కేసులు నమోదైనట్లు తెలుస్తున్నది. సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యపర్చడం, ఫాగింగ్ వంటి చర్యలు మొక్కుబడిగానే ఉంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

### ప్రైవేటు ఆసుపత్రుల నిలువు దోపిడీ..

జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తుండడంతో ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రులు బాధితులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరం వచ్చినప్పుడు రక్తకణాలు పడిపోవడం సర్వసాధారణం. ప్లేట్‌లెట్లు పడిపోయిన ప్రతి జ్వరాన్ని డెంగీగా భయపెట్టి ప్రైవేటు ఆసుపత్రులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయని మండిపడుతున్నారు. అవసరం లేకపోయినప్పటికీ నాలుగైదు రోజులు ఆస్పత్రుల్లోనే ఉంచుకుని రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. డెంగీ ఉన్నా.. లేకపోయినా ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు రకరకాల టెస్టుల పేరుతో ముక్కు పిండి వసూలు చేస్తున్నారని రోగులు చెబుతున్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు దందా నిర్విఘ్నంగా సాగుతున్నదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



# ఐపీఎస్‌లతో బదిలీల బంతాట!

**రెండు మూడు నెలల్లోనే స్థానచలనం**

**7 నెలల్లో రాచకొండకు నలుగురు కమిషనర్లు**

**రెండో సారి కమిషనర్‌గా సుధీర్‌బాబు నియామకం**



బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌బాబు

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐపీఎస్ అధికారులతో బదిలీల బంతాట ఆడుతున్నది. ఒకటి రెండు నెలలు పని చేయకముందే బదిలీలు చేస్తూ అధికారులను పూర్తిస్థాయిలో పనిచేయనీయకుండా చేస్తూ.. తమకు పాలనపై ఏ మాత్రం అవగాహన లేదనే విషయాన్ని పదే పదే రుజువు చేస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు ఏడు నెలల్లోనే నలుగురు అధికారులు బదిలీ కావడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఒక అధికారి ఒక కమిషనరేట్‌పై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలంటే కనీసం నాలుగు నుంచి ఆరు నెలల సమయం పడుతుంది. అలాంటిది రెండు మూడు నెలలకో అధికారిని మారుస్తూ.. వెళ్తే అధికారులు ఎలా పనిచేస్తారంటూ సామాన్యులు సైతం ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిసెంబర్ 13న రాచకొండ కమిషనర్‌గా ఉన్న డీఎస్ చౌహాన్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో సుధీర్‌బాబును నియమించారు. ఆ తరువాత రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో సాంకేతిక కారణాలతో ఆయనను బదిలీ చేసి.. ఆ స్థానంలో తరుణ్ జోషిని నియమించారు. నాలుగోసారి తరుణ్‌జోషిని అక్కడి నుంచి బదిలీ చేసి తిరిగి సుధీర్ బాబును నియమిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీజోన్ ఐజీగా ఉన్న సుధీర్‌బాబు అక్కడ పట్టు సాధిస్తుండగా, ఇక్కడ తరుణ్‌జోషి పట్టు సాధిస్తున్నారు. ఇంతలోనే ఈ బదిలీ జరగడంపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. ఇదిలా ఉండగా, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈస్ట్‌జోన్ డీసీపీగా ఉన్న గిరిధర్‌ను మూడు నెలల్లోనే వనపర్తి జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఆయనను మొదట ఎస్‌వోటీ మల్కాజిగిరి డీసీపీ నుంచి ఈస్ట్‌జోన్‌కు బదిలీ చేశారు. ఆ తరువాత ఇప్పుడు మరోసారి బదిలీ చేశారు. మూడు నెలల కిందట సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన ఉదయ్‌కుమార్‌రెడ్డిని మెదక్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో చంద్రమోహన్ నియమించారు. రాచకొండ ఎస్బీ డీసీపీగా ఉన్న బాలస్వామిని మెదక్‌కు.. తాజాగా, ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీ చేసింది. కార్ హెడ్‌క్వార్టర్స్ అదనపు సీపీ సత్యనారాయణ మల్టీజోన్-2 ఐజీగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో డీసీపీ రక్షిత.కె మూర్తిని నియమించారు.

## అవినీతికి పాల్పడిన అధికారుల స్థానంలో కొత్తవారు

వికారాబాద్, జూలై 10 : ఆటవీ శాఖలో అవినీతికి పాల్పడిన అధికారుల స్థానంలో కొత్త అధికారులు బాధ్యతలు సేకరించారు. రెండు రోజుల క్రితం తాండూరు ఎఫ్ఆర్వోగా అబ్దుల్ హైసాబ్ బాధ్యతలు తీసుకోగా.. బుధవారం వికారాబాద్, ధారూరు ఎఫ్ఆర్వోగా శ్యామ్‌కుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. అవినీతి ఆరోపణల్లో భాగంగా జూలై 2న వికారాబాద్ ఎఫ్ఆర్వో అరుణ, తాండూరు ఎఫ్ఆర్వో శ్యామ్‌సుందర్‌లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయినా వారు ఉత్తర్వులను లెక్క చేయకుండా యథావిధిగా విధులకు హాజరుకావడం వివాదాస్పదమైంది. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ ఉన్నతాధికారులు వారి స్థానంలో కొత్త అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# సంరక్షకుడే హత్య చేశాడు

**కమ్మదనం ఫాంహౌస్‌లో రియల్టర్ కమ్మరి కృష్ణ దారుణ హత్య**

**గొంతు కోసి అంతమొందించిన బాడీగార్డు బాబా**



కమ్మరి కృష్ణ (ఫైల్)

షాద్‌నగర్, జూలై10 : యజమాని రక్షణ చూసుకోవాల్సిన సంరక్షకుడే హత్యకు పాల్పడిన దారుణ ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ ఫాంహౌజ్‌లో బుధవారం సాయంత్రం జరిగింది. షాద్‌నగర్ పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం హైదరాబాద్‌లోని హైదర్షా కోట్ ప్రాంతానికి చెందిన కమ్మరి కృష్ణ(57) రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర వ్యాపారాలు చేసేవారు. ఇందులో భాగంగానే కొన్నేండ్ల క్రితం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూమిలో ఫాంహౌజ్‌ను నిర్మించుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఎప్పటిలాగే కమ్మరి కృష్ణ వ్యక్తిగత బాడీగార్డు బాబా , కమ్మరి కృష్ణ ఇరువురు కలిసి సాయంత్రం 5.30 గంటల సమయంలో టీ తాగారు. అనంతరం బాబాతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కమ్మరి కృష్ణపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడిన కృష్ణను శంషాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కమ్మరి కృష్ణ వద్ద బాడీగార్డుగా పనిచేసే బాబానే హత్యకు పాల్పడినట్లు తెలుస్తున్నదని ఏసీపీ రంగస్వామి తెలిపారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలువలేదని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. హత్యచేసిన అనంతరం దుండగులు కారులో పారిపోయారని, హత్యకు గల కారణాలు తమకు కూడా తెలియదని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు .

# పైసల కష్టం.. ప్రాణాల మీదకు

**ముగ్గురు పిల్లలతో తండ్రి ఆత్మహత్యాయత్నం**

**నేరుగా చెరువులోకి కారు.. ఆర్థిక ఇబ్బందులే కారణం**

**స్థానికుల తక్షణ స్పందన.. అందరూ సురక్షితం**

**అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనామ్‌గూడలో ఘటన**



తాడు, ట్యూబు సాయంతో పిల్లలను బయటకు తీసుకొస్తున్న స్థానికులు

పెద్దఅంబర్‌పేట, జూలై 10: సమయం ఉదయం 6 గంటలవుతుంది.. ఓ తండ్రి వాకింగ్ పేరుతో కారులో ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి బయలుదేరాడు. కారు నడుపుతూనే సోదరుడికి వీడియో కాల్ చేసి తాను పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు చెప్పి ఫోన్ కట్ చేశాడు. దాదాపు 30 కిలోమీటర్లు ప్రయాణం చేశాడు. చివరకు తాను, పిల్లలతో సహా కారును చెరువులోకి తీసుకెళ్లాడు. పిల్లలు హాహాకారాలు చేయడంతో మునిగిన కారు డోర్ తెరిచాడు. పిల్లలు బయటకొచ్చి కారు పైకి ఎక్కగా.. అదే కారును పట్టుకుని తండ్రి నిలబడిపోయాడు. ఆ పక్కనే తాటికల్లు తీస్తున్న గీత కార్మికుడు గమనించి.. స్థానికులను అప్రమత్తం చేయడంతో ముగ్గురు పిల్లలు సహా తండ్రి ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనామ్‌గూడలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం గుడిబండకు చెందిన రాసం అశోక్‌కుమార్, భార్య సుజాత, 15 ఏండ్లలోపు వయసున్న ముగ్గురు పిల్లలు అభిగ్నశ్రీ, శ్రీధర్, సహస్రతో కలిసి హైదరాబాద్‌లోని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీహోమ్స్ కాలనీలో నివసిస్తున్నారు. అశోక్‌కుమార్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలతో ఆర్థికంగా కష్టాలు చుట్టుముట్టాయి. అశోక్‌కుమార్ పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ముగ్గురు పిల్లలను వెంటబెట్టుకుని కారులో ఇంటి నుంచి బయలుదేరాడు. మండల పరిధిలోని ఇనామ్‌గూడ చెరువు కట్టపైనుంచి నేరుగా చెరువులోకి తీసుకెళ్లాడు. కారు నీటిలో మునిగిపోతుండగానే.. ఆ పక్కనే తాటిచెట్టుపై కల్లు తీస్తున్న గీత కార్మికుడు పాండు గమనించాడు. ఫోన్‌ద్వారా గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామంలోని యువకులు వెంటనే స్పందించి చెరువు వద్దకు చేరుకున్నారు. అప్పటికే కారులో నుంచి పిల్లలు కారు పైభాగంలోకి వచ్చి నిలబడిపోయారు. స్థానిక యువకులు తాళ్లు, ట్యూబ్‌ల సాయంతో నీళ్లలోకి దిగి ఒక్కొక్కరిని ఒడ్డుకు చేర్చారు. చివరకు అశోక్‌కుమార్‌ను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే మీర్‌పేటతోపాటు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిస్థాయిలో నీటిలో మునిగిపోయింది.

### వాట్సాప్ మెసేజ్.. స్టేటస్‌లో శ్రద్ధాంజలి

పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు అశోక్‌కుమార్ వీడియో కాల్ చేసి సోదరుడికి తెలిపాడు. ఆయన అశోక్‌కుమార్ భార్యకు సమాచారం ఇచ్చి, వెంటనే మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తున్నది. పోలీసులు అశోక్‌కుమార్ సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఇనామ్‌గూడ చెరువు వద్దకు చేరుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సాయంతో వారిని క్షేమంగా ఇంటికి చేర్చారు. అయితే, కారు చెరువులోకి తీసుకెళ్లకముందే అశోక్ తన వాట్సాప్ స్టేటస్‌లో తన శ్రద్ధాంజలి ఫొటో పెట్టుకున్నట్టు తెలుస్తున్నది. అశోక్‌కుమార్‌కు కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్టు పోలీసులు తెలిపారు.

# బోనం ఘనం



ధారూరు మండలంలోని నాగసముందర్ గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



కులకచర్ల మండలంలోని మరికల్ గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వికారాబాద్ జిల్లాలోని పలుచోట్ల ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాల్లో డప్పువాయిద్యాలు, భాజాభజంత్రీల మధ్య మహిళలు బోనమెత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, చిన్నాపెద్ద కేరింతలు, ఆటపాటలతో పల్లెల్లో సందడి నెలకొన్నది. భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండి సుఖసంతోషాలతో ఉండేలా ఆశీర్వదించు అమ్మోరుతల్లీ అంటూ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి వేడుకున్నారు.